నిలిచిన మిర్చి కొనుగోళ్లు

ముదిగొండ చైనా కారం మిల్లులో పరిస్థితి

- ఆశ చూపించి వదిలేసిన చైనం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతన్నలు



కొనుగోలు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు(ఫైల్)



చైనా కారం మిల్లు వద్ద బారులు దీరిన లారీలు (ఫైల్)

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న చెంగ్‌వాంగ్ బైయోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతుల వద్ద గత పదేళ్ల నుంచి మిర్చి కొనుగోళ్లు చేస్తున్నారు. ఎమైందో ఎమో గానీ గత రెండేళ్ల నుంచి మిరపకాయలు కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రతీ సంవత్సరం రైతులు పండించిన మిరపకాయలు విక్రయించేందుకు ఎలాంటి తరుగు తారం లేకుండా, సంచులు, కమిషన్ లేకుండా నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోళ్లు చేసిన పరిశ్రమవాళ్లు ఇప్పుడు అకస్మాత్తుగా చేతులెత్తేశారు. మిర్చి కొనుగోళ్లు చేసిన మరుసటి రోజే రైతుల ఖాతాలో డబ్బులు జమచేసిన పరిశ్రమ ప్రతినిధులు ఇప్పుడు కొనుగోళ్లు చేసేందుకు వెనుకాడుతున్నారు. దీంతో అలవాటుపడిన రైతులు ఇతర ప్రాంతాల్లో, మధ్యదళారీలవద్ద విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి గ్రామంలో మిరప కొనుగోలు చేసే దళారులుండడంతో పాటు, బయట మార్కెట్‌కు తరలించాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ముదిగొండ సమీపంలో ఉన్న మిర్చి పరిశ్రమలో విక్రయాలు జరిగితే క్వింటాకు రూ.2వేలు మిగులుతాయని, ఇప్పుడు మిగిలేది కాకుండా.. తగులుతున్నాయని అంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇటీవల రైతు సంఘం నాయకులు మిర్చి కొనుగోళ్లు చేయాలని అధికారులకు, చైనా కంపెనీ ప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేశారు. అయినా ఇంత వరకు మిర్చి కొనుగోళ్లు ప్రారంభించలేదు. ప్రతి సంవత్సరం జనవరి నుంచి ఏప్రిల్‌వరకు కొనుగోళ్లు చేసి ఇతర దేశాలకు తరలిస్తుంటారు. ఇతర దేశాల్లో మిర్చి ఆయిల్‌కు తగిన ధర రావడంలేదనే సమాచారం. దీంతో పరిశ్రమ ప్రతినిధులు రైతుల వద్ద నుంచి కొనుగోళ్లు నిలిపివేసినట్లు తెలిసింది. ఇకనైనా దళారీల వద్ద కాకుండా రైతుల మిర్చిని పరిశ్రమలో కొనుగోళ్లు చేయాలని రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

ధర ఉన్నప్పుడే నిలిపివేశారు..



ప్రతి సంవత్సరం మిర్చి పంటను మూడెకరాల్లో పండించి ఎప్పుడికప్పుడు మార్కెట్‌కు తరలించి అమ్ముతుంటాం, కాని ముదిగొండలోని చైనా కారం మిల్లు వచ్చిన తరువాత ఇక్కడే అమ్మేవాళ్లం. రెండేళ్ల నుంచి సరిగా కొనుగోళ్లు చేయడం లేదు. దగ్గరలో ఉన్న మిల్లులో కొనుగోళ్లు చేస్తే మాకు చాలా ఖర్చులు మిగులుతాయి. అధికారులు స్పందించాలి.

– జూలకంటి సంజీవరెడ్డి, రైతు, మేడేపల్లి

కొనుగోళ్లు చేయాలి..



ప్రతి ఏటా కొనుగోళ్లు చేసిన వి.దంగా మిర్చి కొనుగోళ్లు చేయాలి, లేదంటే ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి. ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఉందని రైతులు అలవాటు పడి ఇక్కడే ఎక్కువ మంది విక్రయించుకున్నారు. ఈ ఏడాది సరిగా పండక, పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పటికే నష్టాల్లో ఉన్నారు. పరిశ్రమ ప్రతినిధులు కొనుగోళ్లు చేసేందుకు చొరవ తీసుకోవాలి.

– మర్లపాటి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకుడు, ముదిగొండ

గురుకుల డిగ్రీ లెక్చరర్లుగా ఎంపిక



సాంబశివరావు



రామారావు



గోపాల్‌రావు



నిషిత



సుధీర్

వైరా/కొణిజర్ల/తల్లాడ/కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రకటించిన తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్ ఫలితాలలో వైరాకు చెందిన మల్లెంపాటి సాంబశివరావు కామర్స్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆయన స్వస్థలం ఏన్కూరు మండలం శ్రీరామగిరి. ప్రస్తుతం ఆయన ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అదే విధంగా కొణిజర్లకు చెందిన యువకుడు తాతా రామారావు అత్యుత్తమ ప్రతిభ కనబరచి గణితం లెక్చరర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆయన ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. తల్లాడలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంపెల్లి గోపాల్‌రావు గణితం లెక్చరర్‌గా ఎంపిక కాగా.. నూతనకల్ గ్రామానికి చెందిన కర్నాటి నిషిత గురుకుల పాఠశాల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. కల్లూరు మండలంలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన పొలిటికల్ సైన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంక్ సాధించి డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా ఎంపికయ్యాడు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పీజీ పూర్తి చేశాడు. జాతీయ స్థాయిలో నిర్వహించే యూజీసీ నెట్, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టీఎస్ సెట్, ఏపీ సెట్ పరీక్షలలో అర్హత సాధించాడు.ఈ సదంర్భంగా సాంబశివరావు, తాతా రామారావు, గోపాల్‌రావు, నిషిత, మోదుగు సుధీర్‌లను ఆయా గ్రామాల ప్రజలు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

జేఎల్‌గా ఎంపికైన పూజితకు సత్కారం



పూజితను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిటౌన్: గురుకుల జూనియర్ లెక్చరర్ పరీక్ష ఫలితాల్లో సత్తుపల్లి మండలం తాళ్లమడకు చెందిన గద్దల శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె పవన పూజిత జేఎల్‌గా ఎంపిక కావటంతో శుక్రవారం స్థానిక గీతమ్స్ డిగ్రీ కళాశాలలో ఘనంగా సత్కరించారు. శ్రీవాణి కళాశాలలో ఇంటర్, కాకతీయ కళాశాలలో డిగ్రీ, గీతమ్స్‌లో పీజీ, మిస్ట్ కళాశాలలో బీఈడీ చేసినట్లు పూజిత తెలిపారు. కార్యక్రమంలో గీతమ్స్ కళాశాల అధినేత దొడ్డా శ్రీనివాసరెడ్డి, మందపాటి మమంద్రారెడ్డి, కె.రమేష్, రామయ్య పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న దండు ఆదినారాయణ



బోనకల్: మాట్లాడుతున్న యంగల ఆనందరావు

కొణిజర్ల/సత్తుపల్లిరూరల్/బోనకల్: ఈ నెల 4న ఖమ్మం ఎంబీ గార్డెన్‌లో నిర్వహించే ఖమ్మం పార్లమెంట్ స్థాయి సీపీఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు దొండపాటి రమేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. శుక్రవారం కొణిజర్లలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో, సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో, బోనకల్‌లోని రాయన్నపేట గ్రామంలో పార్టీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీ సాగిస్తున్న దుర్మార్గపు పాలన గురించి ప్రజలకు వివరించి చైతన్యం చేయడానికి తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళిక జిల్లా సమావేశంలో నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని సీపీఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు స్వర్ణ రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సీతారాములు, వెంకటేశ్వర్లు, లాల్ మహమ్మద్, మారయ్య రంజాన్‌బి, బాజీ, శ్రీలత, నాగూర్‌బి, సుప్రియ, కృష్ణకుమారి, రమణ, పుల్లారావు, పరగడుపు కృష్ణ, వరలక్ష్మి, షేక్ హమీద్, రంజాన్‌అలి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి మోటార్ సైకిల్ ర్యాలీ

తల్లాడ: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంధా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎ.వెంకన్న అన్నారు. తల్లాడలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మూడు విప్లవ పార్టీలు విలీనమై మాస్‌లైన్ జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వెంకన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంధా నాయకులు షేక్‌లాల్‌మియా, కె.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు, పటాన్ నాగుల్‌మీరా, గార్లపాటి నాగేశ్వరరావు, రాఘవ ప్రసాద్, ఖాజావిఎయా, నారాయణ, నరసింహారావు, వీరయ్య, రాజారత్నం పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో సీపీ తనిఖీ

కొణిజర్ల: కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడగా, పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం రాత్రి కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఘటనా వివరాలను ఏసీపీ రహమాన్, సీఐ సురేష్, ఎస్‌ఐ శంకరరావును అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత రామారావు ఇంటిని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ బృందం చేరుకోగా, జాగిలాలు కొద్ది దూరం వరకు వెళ్లి వెనక్కి వచ్చినట్లు సమాచారం.

బ్యూటీషియన్ కోర్సుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాధవి

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బ్యూటీషియన్ కోర్సుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బ్యూటీషియన్ ఎం.మాధవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు బ్యూటీషియన్‌తో పాటు త్రెడ్డింగ్, ఫేషియల్ మసాజ్, హెయిర్ కేర్ రొటీన్, టాన్ రిమూవింగ్, మేకప్ స్టెప్స్ తదితర విషయాలను నేర్పించారు. ప్రిన్సిపాల్ ఏఎల్ఎస్ శాస్త్రి, ఉమెన్ ఎంపవర్ మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఇందిర, అర్థశాస్త్ర అధ్యాపకురాలు జి.అరుణ, కామర్స్ అధ్యాపకురాలు డాక్టర్ పి.సుజాత పాల్గొన్నారు.

సీసీరోడ్లకు శంకుస్థాపన

కల్లూరురూరల్: మండలంలోని తాళ్లూరు పంచాయతీలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదేశాల మేరకు శుక్రవారం మాజీ సర్పంచ్ తోటకూర శేషగిరిరావు శంకుస్థాపన చేశారు. రామకృష్ణ, నాయుడు గోపి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లింకు రోడ్ల నిర్మాణం చేపట్టాలి

ఏన్కూరు: మండలంలో గిరిజన ప్రాంతాల్లో లింకురోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ ఆరెం వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతాలకు కేటాయించిన నిధులను గిరిజన ప్రాంతాలకు ఖర్చు చేయడం లేదన్నారు. మండలంలో ఏఈ ఉండగా వేరే మండలంలో పని చేస్తున్న ఏఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడం ఎంటని ప్రశ్నించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా విజిలెన్స్ విచారణ చేయాలని కోరారు.

అక్రమ మట్టి తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తుండటంతో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు శుక్రవారం టాస్క్‌ఫోర్ ఏసీపీ శివరామ్ ఆధ్వర్యాన పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి తవ్వకాలు చేస్తున్న ఒక జేసీబీ, రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: మండలంలోని బుగ్గపాడు గ్రామంలోని శ్రీఅన్నపూర్ణ సహిత మోక్ష రుద్రేశ్వర స్వామిని శుక్రవారం హెటిరో అధినేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మూరు శ్రీరాంప్రసాద్, బొడ్డు శివ పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం..

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన ఆత్మకమిటీ మాజీ చైర్మన్ వనమా వాసు కుమారుడు లక్ష్మణసాయి, ప్రత్యూషల వివాహం జరగగా శుక్రవారం నూతన దంపతులను రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆశీర్వదించారు. కార్యక్రమంలో మల్లూరు అంకమరాజు ఉన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తే 90 శాతం వడ్డీ రాయితీ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయి ఉన్న వారు ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తే 90శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వేణు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బకాయి ఉన్నవారు ఈనెల 31లోపు పన్ను చెల్లిస్తే 10శాతం వడ్డీ మాత్రమే పడుతుందని పేర్కొన్నారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ధరణి పోర్టల్ భూముల పరిశీలన

బోనకల్: ధరణి పోర్టల్ ప్రక్షాలనలో భాగంగా తహసీల్‌లో వ్యవసాయ, రెవెన్యూ శాఖలతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల భూములకు సంబంధించి ఫీల్డ్ లెవల్‌లో పరిశీలన జరిపారు. బోనకల్, రాయన్నపేట గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను తహసీల్దార్ పున్నం చందర్ వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, ఏఓ సరిత, ఏఈఓలు పాల్గొన్నారు.

పరామర్శ

కొణిజర్ల: రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దాడికి గురై ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావును వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడ్డ వ్యక్తులను త్వరిగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు ఎంపీపీ గోసు మధు, నారాయణరావు, శ్రీనివాసరావు, కిరణ్ తదితరులున్నారు.

నిందితులను శిక్షించాలి

కొణిజర్ల: కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించి వైరా సీఐ సాగర్‌కు వినతిపత్రం అందించారు. దాడికి పాల్పడి రెండు రోజులు గడిచినా స్వయంగా బాధితుడు నిందితుల పేర్లు వెల్లడించినా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. దీనిపై సీఐ సాగర్ మాట్లాడుతూ.. విచారణ జరుపుతున్నామని అతి త్వరలో నిందితులను పట్టుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా రామారావు త్వరగా కోలుకోవాలని కోరుతూ.. పలువురు మహిళలు స్థానిక కోదండ రామాలయంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

డిజిటల్ సేవలను ఉపయోగించుకోవాలి

మధిరరూరల్: డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. స్థానిక శ్రీనిధి డిగ్రీ కళాశాలలో డిజిటల్ లిటరసీ వీక్ 2024 సందర్భంగా శుక్రవారం డిజిటల్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్సూరెన్స్, సేవింగ్ అకౌంట్, విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీఎక్స్, జీవిత బీమా గురించి అవగాహన కల్పించారు. బ్యాంకులో యూపీఐ సదుపాయం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ గోపిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు వితరణ

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామ పంచాయతీకి తాళ్లూరి శేషయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ. లక్ష విలువ చేసే ఫ్రీజర్ బాక్సును శుక్రవారం పంచాయతీ కార్యదర్శి బండా వేణుగోపాల్‌కు అందజేశారు. తాళ్లూరి నాగమణి, తాళ్లూరి కృష్ణ, తాళ్లూరి కమలశ్రీ, తాళ్లూరి వెంకటయ్య, తాళ్లూరి నాగేశ్వరరావు, ఆకుల రమేష్, వల్లభ శ్రీను, షేక్.ఖాదర్ గూడపాటి సూర్యం, శ్యాం సుందర్, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ఎం.వెంకటనర్సయ్య, రామారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే 'కాంగ్రెస్' ధ్యేయం



విశ్వనాథపల్లిలో బీటీరోడ్డును ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండలంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత భాగ్యనగర్ తండా గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం విశ్వనాథపల్లి గ్రామంలో ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.80కోట్లతో విశ్వనాథపల్లి ఆంజనేయస్వామి గుడి రోడ్డు నుంచి బుగ్గవాగు చెక్ డ్యాం వరకు, విశ్వనాథపల్లి ఆంజనేయస్వామి గుడి రోడ్డు నుంచి డబుల్‌బెడ్‌రూంల వరకు రెండు బీటీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అంతకుముందు అప్పాయిగూడెం రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల, జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీటీసీ సభ్యులు ఆలోతు ఈశ్వరీనందరాజ్, వడ్డె అజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన..

మండలంలోని బుగ్గవాగు సమీపంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న కోటిలింగాల జాతర ఏర్పాట్లను వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ జాతరకు వేలాదిగా భక్తులు వస్తారని, బుగ్గవాగులో స్నానాలు ఆచరించి, శివాలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారని ఆలయ పూజారి గంధం విజయ్‌కుమార్‌శర్మ ఎమ్మెల్యేకు వివరించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎస్సై ఎన్.రాజారాం, విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్, ఆలయ చైర్మన్ సీహెచ్ కృష్ణయ్య, ఆలెం వెంకటేశ్వర్లు ఉన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతుల వెల్లువ

ముదిగొండ: మండలంలో శుక్రవారం పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ముదిగొండలోని ప్రభుత్వ కళాశాల, పాఠశాలలు, మజీద్‌కు సమీపాన ఉన్న మూడు వైన్ షాపులను తొలగించేలా చూడాలని సీపీఎం నాయకులు కోరారు. అలాగే, ముదిగొండ సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయించాలని, శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం, యడవల్లి లక్ష్మీపురం, రాఘవాపురం రైతుల కోసం ఎత్తిపోతల పథకం నిర్మించడంతో పాటు ముదిగొండ ఎస్సీ గురుకుల హాస్టల్ కొనసాగింపు, కోదాడ–ఖమ్మం రహదారిని అభివృద్ధి, ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ చేయించాలని విన్నవించారు. వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, సీపీఎం నాయకులు భట్టు పరుషోత్తం, మందరపు వెంకయ్య, ఇరుకు నాగేశ్వరరావు, వేల్పుల భద్రయ్య, మెట్టెల సతీష్, టాగూర్, మల్లారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సీతారాంపురంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి ఘనంగా సన్మానించారు.



డిప్యూటీ సీఎంను సన్మానిస్తున్న యలగొండస్వామి

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం



పెనుబల్లి: మాదిగ అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఆ సంఘం నాయకులు

సత్తుపల్లిరూరల్/తల్లాడ/పెనుబల్లి: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని ఎస్ఎంఎస్ హాస్టల్‌లో, తల్లాడలో, వీయంబంజర్ రింగ్ సెంటర్‌లో శుక్రవారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొలికపోగు వెంకటేశ్వరరావు మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జాతి అభివృద్ధి కోసం తమ ప్రాణాలను పణ్ణంగా పెట్టి అసువులు బాసిన మాదిగ అమర వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం రింగ్ సెంటర్‌లో మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల నాయకులు గోళ్లమూడి శ్రీను, గొల్లమందల ముత్తారావు, పరిగడుపు లక్ష్మణ్, తాళ్ల అర్జున్, జొన్నలగడ్డ రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ మాదిగ, ఆదూరి రవి, ఆదూరి బాలక్రిష్ణ, బాబు, సుదాకర్, మధు, నరసింహారావు, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, డి.దుర్గయ్య, వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వరరావు, ప్రసాద్, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక టెట్ నిర్వహించాలి

మధిర: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్.నాగూర్ వలీ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ రావిరాల లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. మధిర ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన యూటీఎఫ్ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదోన్నతులు తక్షణమే జరుగుతాయని అందరూ ఆశించగా.. అందుకు భిన్నంగా జాప్యం జరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో ప్రకటించాల్సిన డీఏలు, పెండింగ్ బిల్లుల జమ ఆలస్యం కావడం శోచనీయమని తెలిపారు. రాజ్యాంగం అందించిన సమాఖ్య విధానానికి భిన్నంగా నూతన విద్యా విధానం 2020 పేరుతో ప్రాథమిక పాఠశాల్లో నమోదులు, ఆరు సంవత్సరాలు నిండిన తర్వాతనే చేయాలని కేంద్రం ఆదేశించడం ప్రభుత్వ విద్యా రంగంలో విద్యార్థుల నమోదులను తగ్గిస్తుందన్నారు. ఈ దిశగా ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు చెన్నయ్య, ఇబ్రహీం, జీబీఎంఎస్ రాణి, లాల్ అహ్మద్, సాధు సమాధానం, భాస్కరరావు, కొండలరావు, రాజు, రమేష్, కళావతి, సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగూర్ వలీ

పెళ్లి వేడుకలో హిజ్రాల అకృత్యాలు

పెనుబల్లి: వీయంబంజర్ ఎంప్లాయిస్ కాలనీలో జరుగుతున్న ఓ పెండ్లి రిసెప్షన్ వేడుకలో హిజ్రాలు డబ్బు కోసం డిమాండ్ చేస్తూ వికృతంగా ప్రవర్తించారు. దీంతో వారు వీయంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు హిజ్రాలను స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. శుభకార్యాల వద్ద అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి

పెనుబల్లి: అసంఘటిత కార్మికులను ఆదుకోవాలంటూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లంకపల్లిలో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుడిమెట్ల బాబు, ఎస్‌కె రాజీ, టి.హరి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శేషగిరి, ఆనందరావు, చిరంజీవి, నాగమణి, కొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానంగా భావించి ప్రతి వ్యక్తి రక్తదానం చేసే గుణాన్ని అలవార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి శ్రీనివాసరావు, డాక్టర్ రాజేష్, పి.శ్రీనివాసరావు, సూర్య, వెంకటేశ్వరరావు, మాధవి, సరీన్, బంగారి, రాంబాబు, వినోద్‌కుమార్, రవికుమార్, సారంగపాణి, వీరారెడ్డి, చెన్నారావు, ప్రభావతి, ఆంజనేయులు, మురళి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజశ్యామల మహాయాగం

ఎర్రుపాలెం: మండలంలోని తెలంగాణ తిరుపతి జమలాపురం గ్రామ సమీపంలో కాంగ్రెస్ నాయకులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో సకల జనుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న శ్రీరాజశ్యామల మహాయగం రెండో రోజు శుక్రవారం కొనసాగింది. పురోహితులు మడుపల్లి సతీష్ శర్మ నేతృత్వంలో యాగశాలలో పలువురు ఋత్వికులు మంగళ వాయిద్యాలలో గణపతిపూజ, దేవతాహోమాలు, మంత్రపుష్పం, చండీపారాయణం, రాజశ్యామల హోమం, నవ శ్యామల హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం యువసేవ సమితి కిష్టారం అధ్యక్షుడు తీగవరపు కేశవరెడ్డి, కార్యదర్శి ఉబ్బన దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన పరీక్ష ప్యాడ్లను శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ కుసుమకుమారి, జాను దంపతుల సహకారంతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువసేవా సమితి జొన్నలగడ్డ రాజు, యువసేవా సమితి ఫుడ్ డైరెక్టర్ ఈదుల ప్రిన్స్, సేవాసమితి ముఖ్య సభ్యులు మల్లెల వెంకి, పూర్ణ కంటి శ్యామ్, కిష్టారం సభ్యులు సిద్దెల మహేష్, రవితేజ, దుర్గాచలం, దుర్గాప్రసాద్, జానపాటి ప్రదీప్ పాల్గొన్నారు.